ఇన్నర్ రింగ్ రోడ్.. యమ డేంజర్!

- వరుస ప్రమాదాలతో వాహనదారులు హడల్
- ఎక్కువ ప్రమాదాలకు మద్యం మత్తే కారణం!
- కిలో మీటర్ పరిధిలో ఏడు మద్యం దుకాణాలు
- రోడ్లపైనే మద్యం తాగుతున్న డ్రైవర్లు

- ఇటీవల సింగ్ నగర్‌కు చెందిన ఓ యువకుడు స్నేహితులతో టీ తాగేందుకు ఇన్నర్ రోడ్డుపైకి రాగా.. టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- వైఎస్సార్ కాలనీకి చెందిన బైక్ మెకానిక్ తన పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద టిప్పర్ ఢీకొని మరణించాడు.

ఇలా నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటుండగా, వారంలో ఒక రోజు ఎవరో ఒకరు మృత్యువాత పడుతున్నారు.



ఇన్నర్ రింగ్ వద్ద జరిగిన ప్రమాదం(ఫైల్)

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరంలోని పైపుల రోడ్డు నుంచి వైవీ రావు ఎస్టేట్, వైవీ రావు ఎస్టేట్ నుంచి పాముల కాలువ మధ్య నిర్మించిన ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. విజయవాడ రూరల్ పరిధిలోని పది గ్రామాలకు పైగా ప్రజలతో పాటు వైఎస్సార్ కాలనీలోని కొన్ని వందల కుటుంబాలు ఇన్నర్ రింగ్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఒకప్పుడు కేవలం రెండు మద్యం దుకాణాలు ఉన్న ఇన్నర్ రింగ్ రోడ్డులో.. ఇప్పుడు ఏడు మద్యం దుకాణాలు వెలిశాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు మద్యం అందుబాటులో ఉండటంతో డ్రైవర్లు మద్యం తాగి వాహనాలను నడుపుతున్నారు. దీంతో ఇన్నర్ రింగ్ రోడ్డు ఎక్కాలంటేనే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందేనని ద్విచక్ర వాహనదారులు పేర్కొంటున్నారు. మద్యం దుకాణాల వల్లే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని ప్రమాదాలలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్యం మత్తే కారణమా?

నిత్యం వందల సంఖ్యలో లారీలు, టిప్పర్లు ప్రయాణించే ఇన్నర్ రింగ్ రోడ్డులో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బార్లు రెస్టారెంట్లతో పాటు వైన్స్‌లు వెలిశాయి. వైవీ రావు రింగ్, పాముల కాల్వ వద్ద మరో బార్ అండ్ రెస్టారెంట్ ఉంది. గతంలో ఈ ప్రాంతంలో రెండు మాత్రమే ఉండగా, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత



ప్రమాదాలకు నిలయంగా మారిన ఇన్నర్ రింగ్‌రోడ్డు

మరో వైన్స్ షాపు వెలిసింది. దీంతో లారీ డ్రైవర్లు, టిప్పర్ డ్రైవర్లు తమ వాహనాలను రోడ్డు పక్కన నిలిపి, బహిరంగంగానే మద్యం తాగుతున్నారు. ఇక పైపుల రోడ్డు వైపున ఆంధ్రప్రభ కాలనీ మలుపులో ఒకటి, అంబాపురం పంచాయతీ పరిధిలో మరొక వైన్స్, వాటర్ ట్యాంక్ రోడ్డుకు సమీపంలో మరో బార్‌తో పాటు వైన్ షాపు వెలిశాయి. దీంతో కిలో మీటర్ పరిధిలో ఆరుకు పైగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడంపై స్థానిక ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 గంటలు దాటడమే ఆలస్యం మందుబాబుల ఆగడాలతో వేగలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపున బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉదయం ఆరు గంటల నుంచే అమ్మకాలు సాగిస్తున్నాయని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

చోద్యం చూస్తున్న పోలీసులు

కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం నాలుగు బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాపులు ఉండగా, వాటిపై సరైన నిఘా లేకపోవడంతో ఉదయం ఆరు గంటల నుంచే అమ్మకాలు సాగిస్తున్నాయి. తెల్లవారక ముందే విజయవాడ, వన్‌టౌన్ పరిసరాల నుంచి ఇన్నర్ రింగ్‌కు వచ్చి మద్యం కొనుగోలు చేస్తున్నారంటే పరిస్థితి ఏ రీతిలో ఉందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. కూలీలు, ముఠా పనులు చేసే వారితో పాటు బిల్డింగ్ నిర్మాణ పనులు చేసే కార్మికులు సైతం మద్యం కోసం ఇన్నర్ రింగ్‌కు తరలివస్తున్నారంటున్నారు. మద్యం ఎప్పుడు అందుబాటులో ఉండటంతో రాత్రి 10 గంటల తర్వాత ఇటు వైవీ రావు ఎస్టేట్ నుంచి పైపుల రోడ్డు వరకు అంతర్గత రోడ్లలో వాహనాలను నిలిపి మద్యం తాగడంతోపాటు వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఫిర్యాదులందుతున్నాయి. రాత్రి 10 గంటల వరకు నగరంలోకి భారీ వాహనాలను అనుమతించకపోవడంతో ఇన్నర్ రింగ్‌రోడ్డులోని వైవీ రావు ఎస్టేట్ వద్ద లారీలు, ఇతర వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. దీంతో రోడ్డుకు దిగువన ఎటువంటి కార్యకలాపాలు సాగించినా రోడ్డుపై వెళ్లే వారికే కాదు పోలీసులకు సైతం కనిపించే అవకాశం లేదు. నగరానికే తలమానికంగా ఉన్న ఇన్నర్ రింగ్ రోడ్డులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జక్కంపూడి కాలనీ వాసులతో పాటు సింగ్‌నగర్ వాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయం వద్ద గురువారం దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గురువారం ఉదయం దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. మల్లేశ్వరస్వామి వారి దర్శనం అనంతరం భక్తులు దక్షిణామూర్తిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పెట్రోల్ బంకులో ఆకస్మిక తనిఖీలు



భవానీపురం(భవానీపురంపశ్చిమ): జాతీయ రహదారి పక్కన దర్గా వద్దగల భారత్ పెట్రోల్ బంకులో గురువారం ఆకస్మిక తనిఖీలు జరిగాయి. విజయవాడ పశ్చిమ తహసీల్దార్ షేక్ ఇంతియాజ్ పాషా, పౌరసరఫరాల శాఖ సర్కిల్–1 ఏఎస్‌ఓ సి. లక్ష్మీనారాయణ రెడ్డి సంయుక్తంగా తనిఖీలు చేశారు. పెట్రోల్ నాణ్యతా ప్రమాణాలు, కొలత సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించారు. అలాగే సేల్స్ రిజిస్టర్, డెన్సిటీ రిజిస్టర్, డెన్సిటీ పరీక్ష చేశారు. కస్టమర్ సంతృప్తి మేరకు సేవలు అందించాలని, ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అధికారులు నిర్వాహకులకు సూచించారు.

కనకదుర్గనగర్‌లో క్యాంటీన్ తొలగింపు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి చెందిన కనకదుర్గనగర్‌లో ఉన్న క్యాంటీన్‌ను గురువారం ఆలయ అధికారులు తొలగించారు. క్యాంటీన్ లీజు గడువు గత ఏడాది డిసెంబర్ 31తో ముగిసింది. దీంతో క్యాంటీన్‌లోని సామగ్రిని తరలించాలని కాంట్రాక్టర్‌కు దేవస్థాన అధికారులు పలు మార్లు నోటీసులు జారీ చేశారు. అయినా కాంట్రాక్టర్ స్పందించకపోవడంతో వెంటనే క్యాంటీన్‌ను తొలగించాలని దుర్గగుడి ఈవో కె. రామచంద్రమోహన్ ఇంజినీరింగ్, లీజెస్ విభాగ అధికారులను ఆదేశించారు. దీంతో శుక్రవారం ఉదయం ఈఈ వైకుంఠరావు, ఆలయ ఇంజినీరింగ్ విభాగం ఏఈలు, సిబ్బందితో పాటు దేవస్థానం లీజెస్ విభాగం ఏఈవో దుర్గారావు, సెక్యూరిటీ సిబ్బంది క్యాంటీన్ వద్ద ఉన్న సామగ్రిని తరలించారు. దేవస్థానంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతుండటంతో వాహనాల రాకపోకలు, భక్తుల వాహనాలను నిలుపుకునేందుకు అడ్డుగా ఉన్న షెడ్డును తొలగించాలని ఈవో ఆదేశాల మేరకు తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు. క్యాంటీన్ తొలగించిన ప్రదేశాన్ని శానిటేషన్ సిబ్బంది శుభ్రం చేసి, భక్తుల వాహనాలను నిలుపుకునేందుకు అవకాశం కల్పించారు.

నైపుణ్యాలు పెంచుకుంటే మంచి అవకాశాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకుంటే ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదిగే అవకాశం ఉందని పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్ ఫౌండర్ సీఈఓ డాక్టర్ షైలా తాళ్లూరి అన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, ప్యూర్ యూత్ హబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం యెష్(యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ స్కిల్ హబ్)ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న షైలా తాళ్లూరి మాట్లాడుతూ యెష్ ద్వారా విద్యార్థులకు వాస్తవ ప్రపంచ అనుభవం, వృత్తిపరమైన వృద్ధి అవకాశాలను, బలమైన ప్రపంచ నెట్‌వర్క్‌ను అందిస్తాయన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ వెల్లంకి శ్రీదేవి, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్స్ స్టేట్ కో ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్, రేడియాలజిస్ట్ డాక్టర్ వీఎస్ వరప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. కల్పన, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎం ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వేలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ నమ్మించి.. రూ. లక్షల్లో వసూలు చేసే ముఠాల పట్ల నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల విజయవాడ డివిజన్ కమర్షియల్ విభాగంలో ఉద్యోగం కల్పిస్తామంటూ రైల్వే ఉన్నతాధికారి ఫోర్జరీ సంతకాలతో కూడిన నకిలీ పత్రాలతో నమ్మించి రూ. 9 లక్షలు దోచుకున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై అధికారులు స్పందిస్తూ రైల్వేలో ఆర్‌ఆర్‌బీ, ఆర్‌ఆర్‌సీల ద్వారా పారదర్శక పక్రియ ద్వారా మాత్రమే ఉద్యోగ నియమాకాల ప్రక్రియ జరుగుతుందన్నారు. దీనిలో ఎటువంటి మధ్యవర్తులు గాని, ఏజెంట్ల ప్రమేయం గానీ ఉండదన్నారు. అభ్యర్థులు మధ్యలోని దళారీలను నమ్మి ఎటువంటి నగదు చెల్లించరాదని, పూర్తి వివరాల కోసం దగ్గరలోని రైల్వే డివిజన్ కార్యాలయాలను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట పడాల వారి వీధికి చెందిన సరగడ వెంకట నాగలక్ష్మి, దుర్గాప్రసాద్ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు సంతానం కాగా నాగలక్ష్మి వన్‌టౌన్‌లో బట్టల దుకాణంలో పని చేస్తుంటుంది. దుర్గాప్రసాద్ రైల్వే స్టేషన్‌లో సమోసాలు అమ్ముతుంటాడు. మద్యానికి బానిసైన దుర్గాప్రసాద్ తెలిసిన వారందరి వద్ద అప్పులు చేశాడు. గత ఏడాది అక్టోబర్ 26న ఇంటి నుంచి బయటకు వెళ్లిన దుర్గాప్రసాద్ తిరిగి ఇంటికి రాలేదు. భర్త గురించి తెలిసిన వారందరినీ విచారించినా ప్రయోజనం లేకపోవడంతో నాగలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కాలువగట్ల సుందరీకరణతో కాలుష్య నియంత్రణ



బందరు కాలువ గట్టును పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): కాలువగట్ల సుందరీకరణతో కాలుష్యాన్ని నియంత్రించటమే కాకుండా కాలువ ఒడ్డున ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు అధికారులు ప్రణాళికను సిద్ధం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం బందర్‌కాలువ వెంబడి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలోని మూడు ప్రధాన కాలువలైన బందరు, ఏలూరు, రైవస్ కాల్వ గట్లను సుందరీకరణ చేపట్టాలని, గట్ల వెంబడి నిరుపయోగంగా ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటాలని, వాకింగ్ ట్రాక్‌లు, సిట్టింగ్ ఏరియాలు, ఆట పరికరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. బందరు కాలువ గట్టును మూడు కిలో మీటర్ల మేర రూ.3.3 కోట్లతో, ఏలూరు కాలువ గట్టును రెండు కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ. 2 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి సుందరీకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్ పి. సత్యకుమారి, జాయింట్ డైరెక్టర్(అమృత్) లతా, డెప్యూటీ డైరెక్టర్(హార్టికల్చర్) రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఆశ్రయాన్ని కల్పించండి

నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా రాఘవయ్య పార్క్, పంజా సెంటర్ ప్రాంతాలలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరంలో నైట్ డ్రైవ్ నిర్వహించి నిరాశ్రయులందరికీ ఆశ్రయాన్ని కల్పించాలని, వారిని విజయవాడ నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న నైట్ షెల్టర్ హోమ్స్‌కి తరలించాలని పట్టణ సాధికార విభాగానికి సూచించారు. ఆశ్రయం పొందిన వారికి వీఎంసీ యూసీడీ విభాగం ప్రతిరోజు పర్యవేక్షిస్తుండాలని, ఆదేశించారు. పంజా సెంటర్, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ఎదురుగా జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని పరిశీలించారు.

నగరంలో ఆటోల సంఖ్యపై పరిమితులు ఎత్తివేత

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో తిరిగే ఆటోల సంఖ్యపై పరిమితులను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో ట్రాఫిక్, పొల్యూషన్‌ను నియంత్రించేందుకు గతంలో ఆటోల సంఖ్యలకు పరిమితులు విధించారు. దీంతో ఇప్పటి వరకు నగరంలో 8,600 ఆటోలకు మాత్రమే తిరిగే అవకాశం ఉండేది. అయితే కొత్తగా వచ్చే ఆటోలన్నీ సీఎన్‌జీ, ఎల్‌పీజీ, పెట్రోల్, బ్యాటరీ వాహనాలే కావడం, నగర ప్రజల రవాణాకు ఆటోల ఆవశ్యకత ఎక్కువగా ఉండటం, జిల్లాల పునర్విభజన జరిగిన నేపథ్యంలో సంఖ్యాపరమైన పరిమితులను ఎత్తివేస్తున్నట్లు తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కేసరి సుబ్బారెడ్డికి ఆత్మీయ సత్కారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా సెక్రటరీ కేసరి సుబ్బారెడ్డి (చిన్నోడు)కి పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు గురువారం రాత్రి ఆత్మీయ సత్కారం చేశారు. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు సుబ్బారెడ్డిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేసరి సుబ్బారెడ్డి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధి, అంకిత భావంతో నిర్వర్తిస్తానని చెప్పారు. కేసరి చిన్నోడిని అభినందించిన వారిలో వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు జోసఫ్ శివమణి, సరగడ శ్రీనివాసరెడ్డి, ఉండేల శ్రీనివాసరెడ్డి, బోర మల్లేశ్వర రెడ్డి, కామ్మళ్ల జోజి, నక్కా ప్రభుదాస్, వై శ్రీనివాసరెడ్డి, యల్లయ్య రెడ్డి, జీఎస్‌ఆర్ రెడ్డి, నరసింహులు, యరజర్ల నాగరాజు తదితరులు ఉన్నారు.

16న సంకట హర చతుర్థి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకట హర చతుర్థిని పురస్కరించుకుని ఈనెల 16వ తేదీ ఆదివారం ఇంద్రకీలాద్రిపై వినాయకుడికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. ఆదివారం మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో వినాయకుడి ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకాలు, అర్చనలతో పాటు హోమం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ఆర్జిత సేవ టికెట్ కొనుగోలు చేసి పూజలో పాల్గొనవచ్చని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

కమనీయం.. శ్రీవారి మహా పుష్పయాగం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): స్థానిక వేంకటేశ్వర స్వామి వారి మహాపుష్పయాగం గురువారం కమనీయంగా జరిగింది. బ్రాహ్మణవీధిలోని వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం వివిధ రకాల సుగంధ పరిమళాలను వెదజల్లే పలు రకాల పుష్పాలతో స్వామి వారికి పుష్పయాగాన్ని నయనానందకరంగా నిర్వహించారు. గులాబీ, తులసీ, మల్లె, చామంతి వంటి విభిన్న జాతి పుష్పాలతో జరిగిన పుష్పయాగాన్ని తిలకించిన భక్తులు తన్మయులయ్యారు. ఉత్సవమూర్తులను పూర్తిగా పూలతో కప్పే విధంగా వందలాది కిలోల పుష్పాలతో ఈ యాగాన్ని నిర్వహించారు. అలంకార ప్రియుడైన నారాయణుడు ఈ సేవతో మరింత పులికించి భక్తులను అనుగ్రహిస్తాడని పండితులు చెబుతారు.

ఘనంగా తిరుమంజనం..

ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి తిరుమంజన సేవను ఘనంగా నిర్వహించారు. పంచామృతాలు, చందనం వంటి సుగంధ పరిమళ ద్రవ్యాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అభిషేకించిన అర్చకస్వాములు పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ఈవో, చైర్మన్లు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాశ్వత బ్రహ్మోత్సవ ఉభయదాతలను, ఉత్సవాలకు సహకరించిన దాతలను సత్కరించారు.



పుష్పాలంకరణలో స్వామివారు



పుష్పయాగానికి సిద్ధం చేసిన పువ్వులు

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ సోమశేఖర్ నాయక్

భవానీపురం(విజయవాడపశ్చిమ): 'పోషణ్ బీ.. పడాయి బీ' పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో చిన్నారులకు పోషణతో కూడిన చదువు అన్న అంశాన్ని ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త ఆకళింపు చేసుకోవాలని మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ (ఎంఈఓ) సోమశేఖర్ నాయక్ అన్నారు. విద్యాధరపురం లేబర్‌కాలనీలోగల జీఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం 'పోషణ్ బీ.. పడాయి బీ' అన్న అంశంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. వారికి పోషక విలువలు ఉన్న పండ్లు, కూరగాయలు గురించి ఆట–పాటలతో తెలియజేయాలని సూచించారు. అదే విధంగా వాటితో పాటు చదువును ఆసక్తికరంగా చెప్పాలని పేర్కొన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో జీఎస్‌ఆర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి. ప్రశాంతి, వి. నాగమణి, టాటా ట్రస్ట్ కో ఆర్డినేటర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి



సభలో మాట్లాడుతున్న సీపీఐ రామకృష్ణ, చిత్రంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు

వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల తీర్మానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నక్సల్స్ సమస్యను శాంతిభద్రతల సమస్యగా కాకుండా.. రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యగా గుర్తిస్తేనే సరైన పరిష్కారం లభిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆదివాసీలపై మారణకాండను ఆపాలని, 'ఆపరేషన్ కగార్' నిలిపివేయాలని కోరుతూ సభ నిర్వహించారు. సీపీఐ ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ అదాని, అంబానీ వంటి బడా కార్పొరేట్లకు అడవుల్లోని ఖనిజ సంపద అప్పగించే లక్ష్యంతో కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టిందన్నారు. ఆపరేషన్ పేరుతో ఆదివాసులు, మావోయిస్టులపై దారుణ మారణకాండకు కేంద్ర ప్రభుత్వం ఒడిగట్టిందన్నారు. చట్ట విరుద్ధంగా బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడటం దుర్మార్గమన్నారు. మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కగార్ మారణకాండకు అదాని, అంబాని వంటి కార్పొరేట్లే ప్రధాన కారకులనీ, వారి ఆజ్ఞలను మోడీ సర్కార్ అనుసరిస్తున్నదని ఆరోపించారు. అడవులను, అటవీ ఖనిజ సంపదను బడా కార్పొరేట్లకు అప్పగించే లక్ష్యంతోనే 'ఆపరేషన్ కగార్' తెచ్చారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ నిలిపి వేయాలని సభలో తీర్మానించారు. సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు ఉమామహేశ్వరరావు, రైతు నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ రావు, పాత్రికేయుడు డానీ, సీపీఐ ఎం.ఎల్ లిబరేషన్ నాయకుడు హరినాథ్, న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, ఎం.సీపీఐ(యు) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఖాదర్ భాషా, సీపీఐ ఎం.ఎల్. రెడ్ ఫ్లాగ్ నాయకులు మరీదు ప్రసాద్, చిలకా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ స్థాయి నాటికల పోటీలు



నాటికల పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయవాడ కల్చరల్: యూత్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫోరం, కళా విపంచి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఈ నెల 15, 16వ తేదీల్లో జాతీయ స్థాయి సాంఘిక నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు కోశాధికారి డీవీ చంద్రశేఖర్ తెలిపారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. 15వ తేది శనివారం సాయంత్రం ఐదు గంటలకు మహతి క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఉక్కు సంకెళ్లు, హేలాపురి కల్చరల్ అసోసియేషన్ విజయవాడ వారి సారీ రాంగ్ నంబర్, న్యూ స్టార్ మోడరన్ థియేటర్ వారి 27వ మైలురాయి, 16వ తేది ఆదివారం తెలుగు కళాసమితి విశాఖపట్నం వారి నిశ్శబ్దం నీ ఖరీదు ఎంత, శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు, ఉషోదయ నికేతన్ కాట్రపాడు వారి కిడ్నాప్ నాటికలను ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. నాటికల పోటీల సందర్భంగా వివిధ రంగాలకు చెందిన పోతుల కిరణ్‌కుమార్, బెండపూడి మురళీధర్, వజ్ఝా మధుసూధనరావు, అమరేంద్ర బొల్లంపల్లి, అంకం భుజంగరావు, వైవీఎస్ శ్రీనివాస్, జీవీజీ శంకర్, హసన్ షేక్‌లకు విశిష్ట సేవా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నాటికల పోటీలు బ్రోచర్‌ను అతిథులు ఆవిష్కరించారు. సమావేశంలో నాటక రంగ ప్రముఖులు కత్తి శ్యాంప్రసాద్, రమేష్, భాగ్యరాజ్, బుర్రా నరేన్ పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో మోసం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చిట్టీల పేరుతో తమను ఓ వ్యక్తి మోసం చేశాడంటూ పలువురు బాధితులు సింగ్‌నగర్‌లో గురువారం ఆందోళన చేపట్టారు. సేకరించిన వివరాల ప్రకారం.. సింగ్‌నగర్ లూనాసెంటర్‌కు చెందిన బండ్రెడ్డి శివనాగేశ్వరరావు అనే వ్యక్తి వస్త్ర దుకాణం నడుపుతూ.. చిట్టీలు వేసేవాడు. ఈ క్రమంలో స్థానికులు కొందరు అతని వద్ద చిట్టీలు వేయగా, మరికొందరు ఆయనకు అప్పులు ఇచ్చారు. అయితే బుడమేరు వరదల తర్వాత శివనాగేశ్వరరావు అప్పులు ఇచ్చిన వారికి.. చిట్టీలు వేసిన వారికి డబ్బులు ఇవ్వకుండా తిరుగుతున్నాడు. గురువారం శివనాగేశ్వరరావు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడని స్థానికులకు తెలియడంతో బాధితులు లూనాసెంటర్‌లోని శివనాగేశ్వరరావు ఇంటికి వెళ్లగా ఇంటికి తాళాలు వేసి కనిపించాయి. దీంతో బాధితులు తమకు న్యాయం చేయాలంటూ నిందితుడి ఇంటి ముందు బైఠాయించి ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని బాధితులకు చెప్పారు. బాధితులు మొత్తం ఎంత మంది ఉన్నారు.. ఎవరెవరికి ఎంతెంత డబ్బులు ఇవ్వాలనే పూర్తి విషయాలను రాసుకొని పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకొని అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ ఘటనపై ఇంకా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.